# చేపల వేటలో ప్రజలతో మమేకమైన మంత్రి

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హజరై కార్యక్రమం ముగించుకొని తిరుగు ప్రయాణంలో నాగర్‌కర్నూల్ పట్టణ పురపాలక పరిధిలోని కేసరి సముద్రం వద్ద కొంతమంది యువకులు గాలాలతో కూర్చొని చేపలు పడుతుండటంతో అటుగా వెళ్తున్న మంత్రి దృష్టిని ఆకర్షించింది. కాసేపు వాహనం ఆపి వారివద్దకు వెళ్లి చేపలు పట్టే విధానం, పట్టిన చేపల పరిమాణం, ఈకాలంలో చేపల లభ్యత వంటి విషయాల గురించి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరా తీశారు. ఆతర్వాత ఆసక్తితో మంత్రి కూడా గాలంతో పాటు వలను కూడా విసిరి నీటిలో వేసి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఇది చూసిన యువకులు, అక్కడ ఉన్న స్థానికులు ఆనందంగా హర్షం వ్యక్తం చేశారు. తరువాత మంత్రి జూపల్లి కృష్ణారావు అక్కడే చెరువు కట్టపై చేపలు అమ్ముకుంటున్న వ్యాపారులను కలసి వారి జీవనోపాధి, చేపల ధరలు, మార్కెట్‌లో డిమాండ్, వేట సమయంలో ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు తమ అనుభవాలు, సవాళ్లు వివరించగా మంత్రి జూపల్లి వాటిని శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంలో స్థానిక ప్రజలతో మమేకమై, సాధారణ జీవనశైలిని అనుభవిస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు కొంత సమయం గడిపారు.



చేపలు పడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



బోల్తా పడిన బస్సు

## బస్సు బోల్తా .. తప్పిన పెను ప్రమాదం

**- పలు విద్యార్థులకు స్వల్ప గాయాలు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలంలోని గన్యాగుల గ్రామ శివారులో బుధవారం ఉదయం స్కూల్ బస్సు బోల్తా పడటంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగపూర్, రాయిపాకుల గ్రామాల్లోని విద్యార్థులను ఎక్కించుకొని గన్యాగుల మీదుగా పెద్ద కొత్తపల్లికి వెళ్తుండగా గన్యాగుల గ్రామ శివారులోని పాత పాడుబడిన బావి వద్ద మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బస్సు పక్కనే ఉన్న వరిపంటలోకి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న సుమారు 18మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పింది. అదుపు తప్పి బస్సు వరి పంట మడిలో పడడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను బస్సులో నుంచి బయటకు తీసి ఆటోలో ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అక్రమ ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

**దేవరకద్ర, ఆగస్టు 13 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా జరుగుతోంది". అధికారులు పట్టించుకోకపోవడంతో, అక్రమార్కులు పట్టపగలు టిప్పర్ల ద్వారా ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారు. ఫలితంగా, పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోంది. వివరాల్లోకి వెళితే... చౌదర్పల్లి వెంకటాయపల్లి శివారులోని కాకతీయ స్కూల్ సమీపంలోని రైస్ మిల్ వెనకాల కొన్ని రోజులుగా కొందరు అక్రమార్కులు ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తూ జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ ఇసుక ద్వారా జరిగే నిర్మాణం వల్ల భవనాలు ఎక్కువ కాలం మన్నికగా ఉండవని కొనుగోలుదారులు ఇసుకని కొనడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో అక్రమార్కులు కొత్త పంథాకు తెరతీశారు. నాణ్యమైన ఇసుకను బయటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి, దానిని కొంత మొత్తంగా ఫిల్టర్ ఇసుకలో కలిపి నాణ్యమైన ఇసుకగా చూపిస్తూ అధిక ధరలకు విక్రయిస్తు, అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రధాన రహదారికి అనుకొని పట్ట పగలు ఇంత పెద్దగా అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతున్నప్పటికీ, పర్యావరణానికి ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నప్పటికి, అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.




# ఎల్లో అలర్ట్

- నేడు, రేపు భారీ వర్షాలు
- ప్రజలు సురక్షితంగా ఉండాలని సర్కారు సూచన
- లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం
- అవసరమైతే తప్పా బయటకు రావొద్దని హెచ్చరిక
- ఉమ్మడి జిల్లాలో ఉప్పొంగుతున్న వాగులు, చెరువులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు13, ప్రభాతవార్త:** నేడు, రేపు భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అలర్ట్ చేసింది. ఉమ్మడి పాలమూరులోని వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలంతా సురక్షితంగా ఉండాలని సూచించింది. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉండాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో లోతతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు పోలీస్ శాఖ తరఫున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భారీ వర్షం క్లౌడ్ బరస్ట్ వర్షం పడే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈమేరకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, వివిధ శాఖల మంత్రులతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, విద్యుత్, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. బాలానగర్ నుంచి అలంపూర్ వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కరెంట్ స్తంభాలు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్ లు, మొబైల్ వాహనాలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. పొంగి పొర్లే వాగుల, కాజ్ వేలు , బ్రిడ్జి ల వద్ద ఎవరు వెళ్లకుండా చూడాలని, . అగ్నిమాపక శాఖ ఎస్.డి.ఆర్.టీమ్ లను సిద్ధంగా ఉంచాలని అన్నారు. వర్షాల వల్ల నీరు కలుషితమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధుల ప్రబల కుండ జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని 08542 241165 కు సమాచారం అందించాలని సూచించారు.

**ఉమ్మడి పాలమూరులో బుధవారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు**

| మండలం | వర్షపాతం(మి.మీ.) |
| --- | --- |
| పెద్దకొత్తపల్లి | 52.3 |
| ధన్వాడ | 45.0 |
| చిన్నజట్రం | 38.8 |
| సీసీకుంట | 35.8 |
| కొత్తకోట | 31.8 |





మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

## భూ నిర్వాసితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** భూ నిర్వాసితులకు అండగా ఉంటామని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి తెలిపారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోయిన ఊట్కూరు మండలం బాపూర్, దామరగిద్ద మండలం బాపన్‌పల్లి, నారాయణపేట మండలం పేరపళ్ళ, కౌరంపల్లి శివారులోని దాదాపు 71మంది రైతులకు చెందిన 51.36 ఎకరాల భూమికి సంబంధించిన 7కోట్ల 7 లక్షల నష్టపరిహారం చెక్కులను బుధవారం సాయంత్రం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో రామచందర్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆమె తెలిపారు. వాస్తవానికి రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు కింద భూములు పోయినా ఇంత వరకు ఇంకా రైతులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందలేదని, మన జిల్లా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నందుకే భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం డబ్బులను అందజేయడం జరుగుతుందన్నారు. భూనిర్వాసితులు నిరాశ చెందవద్దని, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిలో భూనిర్వాసితులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భూములను ఇవ్వడం అభినందనీయం అన్నారు. రైతుల మేలు మరచిపోలేమని తెలిపారు. ఇన్నేళ్లు ఎడారిగా ఉన్న ఈ ప్రాంతం నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకంతో పచ్చ బడుతుందని ఆమె ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, దామరగిద్ద విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, నారాయణపేట, దామరగిద్ద, ఊట్కూరు తహసిల్దార్లు అమరేంద్ర కృష్ణ, తిరుపతయ్య, చింత రవి, ఆర్డిఓ ఆఫీస్ డీటీ బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, యువజన కాంగ్రెస్ నాయకులు మధు, కోట్ల రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీశైలం డ్యాం 7గేట్లు ఎత్తివేత

- 882అడుగులకు చేరిన నీటిమట్టం
- కుడి,ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి
- జూరాలకు 90వేలక్యూసెక్కుల ఇన్‌ఫ్లో

3

## గతంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలే..

- పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- 3340 మందికి రేషన్ కార్డులు పంపిణీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 13 ప్రభాత వార్త:** పేద ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నగర్‌లోని శిల్పారామంలో మహబూబ్ నగర్ నగరానికి చెందిన 3340 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పేదలను పట్టించుకోలేదని ఆరోపించారు.



రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

భారత దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మన తెలంగాణా రాష్ట్రంలోనే రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అంటేనే సంక్షేమం అనే విధంగా రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఇదే వేదికపై 1500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను లబ్దిదారులకు అందించామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ. నర్సింహారెడ్డి ,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ప్లాట్ల యజమానులకు పెనాల్టీ

- చెత్తాచెదారం పేరుకుపోతే నోటీసులు
- భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 13, ప్రభాతవార్త :** ఓపెన్ ప్లాట్‌లలో చెత్త చెదారం తొలగించాలని, ప్లాట్ యజమానులకు నోటీస్ అందచేసి పెనాల్టీ విధించాలని కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశించారు. రానున్న రెండురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీచేసినందున అన్ని శాఖలు అధికారులు అప్రమత్తంగా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వి.సి కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ. నర్సింహ రెడ్డి ,జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాల వల్ల తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లపై ఎం.పిడి.ఓ.లు, ఎం. పి. ఓ.లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించి వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు పట్టణాలు, గ్రామాలు, తండాలలో ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, ఎక్కడ కూడా ఏచిన్న అవాంచనీయ సంఘటన చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మొదలుకుని జిల్లా పంచాయతీ అధికారి వరకు, ఆశాలు, ఏఎన్ఎంల నుండి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వరకు ఇలా అన్నిశాఖల అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాల్లో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర -మిగతా3లో..



నాయకులకు నచ్చచెబుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## జడ్చర్లలో ఉద్రిక్తత..

**- విగ్రహాల తొలగింపు వద్ద ఆందోళ**

**- నాయకులకు నచ్చజెప్పిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల ఆగస్టు 13 ప్రభాతవార్త:** జడ్చర్ల మీదుగా వెళ్తున్న కోదాడ 167 జాతీయ రహదారి పనుల్లో భాగంగా బుధవారం కొంత ఉద్రిక్తత చోటు చేసుకున్నది. జడ్చర్ల లోని సిగ్నల్ గడ్డ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహంతో పాటు పూలే విగ్రహం కూడా ఉన్నది. ఈ క్రమంలో విగ్రహాలను తొలగించి రహదారి నిర్మాణం చేయాల్సి ఉన్నది. బుధవారం విగ్రహాలను తొలగించేందుకు స్థానిక మున్సిపల్ అధికారులతో పాటు జాతీయ రహదారి అధికారులు కూడా వెళ్లడంతో పలు సంఘాల నాయకులు అడ్డుకున్నారు. విగ్రహాల తొలగింపు ప్రక్రియ సరికాదన్నారు. జాతీయ నాయకుల విగ్రహాలను తొలగిస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పి ఆందోళన నిర్వహించారు. అయితే కల్వకుర్తి చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ, నెహ్రూ విగ్రహాల తొలగింపు లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదు. అయితే సిగ్నల్ కట్టా వద్ద అంబేద్కర్ విగ్రహం తొలగించొద్దు అంటూ కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున భీష్మించి కూర్చున్నారు. సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కమిషనర్ లక్ష్మారెడ్డి కూడా ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని నాయకులకు నచ్చజెప్పారు. ఇది ఇలా ఉండగా జడ్చర్లలో పలు కార్యక్రమాల్లో - మిగతా3లో..

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మక్తల్‌టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రసూతిగది, స్కానింగ్, ల్యాబ్, దయాలసిస్ సెంటర్, జనరల్ వార్డు, డ్రగ్స్ స్టోర్‌ను ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ల్యాబ్‌కు వెళ్లిన కలెక్టర్ అక్కడ రోజుకు ఎన్ని రక్త పరీక్షలు, ఎలాంటి పరీక్షలు చేస్తున్నారని, టీబీనిర్ధారణ పరీక్షలు ఎంత మందికి చేస్తున్నారని, టీబీ కోసం సేకరించిన నమూనాలకు ఎక్కడ స్టోర్ చేస్తున్నారని, చేసిన పరీక్షల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. దయాలసిస్ సెంటర్ లోకి వెళ్ళి ఎన్ని బెడ్స్ ఉన్నాయని, ఎంతమంది దయాలసిస్ చేసుకుంటున్నారనే వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య పనులు చేయించాలని, మరుగు దొడ్ల తలుపులను మరమ్మతు చేయించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు సూచించారు. అనంతరం జనరల్ వార్డుకి వెళ్ళి రోగులతో వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఓపీ విభాగానికి వెళ్లి రోజుకు ఎంత మంది అవుట్ పేషంట్స్ వస్తుంటారని అక్కడి వైద్య సిబ్బందిని ప్రశ్నించగా 200 నుంచి 300



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

మంది దాకా అవుట్ పేషంట్స్ వస్తుంటారని సిబ్బంది కలెక్టర్ కు తెలిపారు. ఆస్పత్రిలో నమోదు అవుతున్న సీజనల్ వ్యాధుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులేమీ లేవు కదా అని ప్రశ్నించగా ఇప్పటిదాకా వైరల్ ఫీవర్ కేసులే ఎక్కువగా నమోదయ్యాయని సిబ్బంది తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం అన్నారు. చివరగా డ్రగ్స్ స్టోర్‌కి వెళ్ళి నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. డ్రగ్స్ కాలపరిమితి ఎలా తెలుస్తుందని డ్రగ్స్ స్టోర్ ఫార్మాసిస్టును అడగడంతో డ్రగ్స్ వచ్చినప్పుడు తాము రిజిస్టర్‌తో పాటు కంప్యూటర్ లోనూ నమోదు చేస్తామని, మందుల నిల్వను బట్టి కాల పరిమితి ముగిసిన వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని ఫార్మాసిస్టు కలెక్టర్‌కు తెలిపారు.



ఆసుపత్రిలో బెడ్లు పరిశీలిస్తున్న కలెక్టర్



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## కుళ్ళిన పదార్థాలు.. కాలం చెల్లిన రసాయనాలు

- విస్తుపోయిన మహబూబ్‌నగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్
- బేకరీ మూసేయాలంటూ ఆదేశం

**జడ్చర్ల, ఆగస్టు13, ప్రభాతవార్త:** జడ్చర్ల బేకరిని తనిఖీ చేసిన ఫుడ్ ఇన్స్పెక్టర్ నీలిజడ్చర్ల పట్టణంలోని శ్రీలక్ష్మి బెంగళూరు బేకరీలో తీసుకున్న కర్రీ పఫ్‌లో పాము వచ్చిన ఘటనపై ఫిర్యాదు అందుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ నీలిమ రంగంలోకి దిగారు. తన సిబ్బందితో కలిసి బుధవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్లో పాము వచ్చిన పఫ్ ను పరిశీలించి, దాన్ని ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. బేకరీ నిర్వహణకు లైసెన్స్ లేనట్లు గుర్తించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

అపరిశుభ్రత వాతావరణంలో బన్స్, కేకులు, బిస్కెట్లు పఫ్ లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతోపాటు ఎక్స్పైరీ డేట్ అయిపోయిన రసాయనాలు, పౌడర్లు వాడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి వస్తువులను వాడుతుండటం పట్ల - మిగతా3లో..

## మత్తు పదార్థాలపై అవగాహన



మత్తు పదార్థాలను వాడబోమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఆగస్టు 13, ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న తరుణంలో బుధవారం రోజు ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ ఎస్సై నరేందర్లు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే జీవితాలను నాశనం చేసుకోమని ప్రస్తుతమే కాకుండా భవిష్యత్తులో కూడా డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలను వాడబోమని విద్యార్థినీ విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాల నివారణ కోసం ప్రభుత్వం కట్టదిత్తమనే చర్యలు తీసుకుందని అందుకు తగ్గట్టుగానే విద్యార్థిని విద్యార్థులు సైతం పోలీసులకు సహకరించి మత్తు పదార్థాలు వినియోగించే వారి సమాచారం చేరవేసిన పక్షంలో గోపెయంగా ఉంచడమే కాకుండా సమాజానికి తోడ్పాటు అందించిన వారవుతారని విద్యార్థినీ విద్యార్థులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం ఆత్మకూరు సిఐ ఎస్ఐతో పాటుగా పలువురు విద్యార్థిని విద్యార్థులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా సామ్రాజ్య విధానాలు దేశానికి ప్రమాదకరం

**అమరచింత ఆగస్టు 13, ప్రభాతవార్త:** అమెరికా సామ్రాజ్య దేశం భారత్ పై పెత్తనం చెలాయించడానికి కుట్ర పన్నుతుందని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు బి వెంకటేష్, కే రాజన్న, భాస్కర్,ఆర్ఎన్ రమేష్,ఎస్ అజయ్,సి రాజు, శ్యాంసుందర్ అన్నారు.భారత్‌పై అమరిక విధించిన శుంకాలను రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద దేశానికి భారత్ పై పెత్తనం చెలాయించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అమెరికా సామ్రాజ్యవాద దేశం అనుసరిస్తున్న విధా నాలు భారతదేశానికి ప్రమాదకరమని వెంటనే భారతి పై విధించిన సుంకాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో పోరా టాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న, మసలమని, భక్తరాజ్, ఏసన్న, తాజ్, సత్యనారాయణ, రాఘవేంద్ర, రాఘవ, రాజు, శంకర్, విష్ణు, రవీందర్, ఎర్రన్న, సౌలు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో
## పోలీస్ అధికారుల ముందస్తు జాగ్రత్త చర్యలు

**ఉప్పునుంతల, ఆగస్టు 13 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాతావరణ శాఖ సూచనతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా మొల్గర వద్ద వాహనాల రాకపోకలతో పాటు వ్యక్తులు దుందుభిని దాటేందుకు ప్రయత్నించకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు.ఈ మార్గం గుండా అన్ని రకాల వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దుందుభి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది ఎలాంటి ప్రాణహాని జరగకుండా వాగుపై రాకపోకలను నిలిపివేసినట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా శిథిలమైన భవనాలలో పాత ఇండ్ల లో నివసించవద్దని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ ఫార్మర్ వద్ద అప్రమత్తంగా ఉండాలని తడిచేతులతో వాటిని తాకరాదని ఆయన వెల్లడించారు. చెక్ డ్యాంలు చెరువులు, వాగుల వద్దకు వెళ్లరాదని అవసరమైతే తప్ప ఇండ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. సాధారణ పరిస్థితులు నెలకొనేంతవరకు పోలీసులకు సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



మొల్గర వద్ద భారీ గేట్లను ఏర్పాటు చేసిన పోలీసులు

## విద్యార్థులకు టై, బెల్ట్‌ల వితరణ

**దాతలను అభినందించిన ఉపాధ్యాయ బృందం**

**పెబ్బేరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం కంచిరావు పల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు పాతిమా వారి స్నేహితురాలు శారద పది వేల రూపాయల విలువైన టై, బెల్ట్ లను స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆత్మ నూన్యత చెందకుండా విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ధరించే స్కూల్ డ్రెస్ ఏకత్వానికి ప్రతీక అయితే వాటి పై ధరించే టై బెల్ట్‌లు విద్యార్థుల క్రమశిక్షణను పెంపొందిస్తాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలు ఫాతిమా, శారదలు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని, సమయాన్ని సద్వినయోగం చేసుకుని మంచి విజ్ఞానాన్ని సంపాదించాలని, మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం దాతలను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల శ్రీదేవి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అనురాధ,రాజేష్ బాబు, సాయి రేణు, వేంకటేశ్వర్లు, కృష్ణవేణి, భాస్కర్, శేఖర్, కృష్ణ చైతన్య, శైలజ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి రాష్ట్ర ప్రజల ఆరోగ్య నిధి

**చెక్కులను పంపిణీ చేసిన రాజేంద్రప్రసాద్ యాదవ్**

**పెబ్బేరు,ఆగస్టు 13 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ మండల నికి సంబంధించిన సీఎం సహాయ నిధి కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డిని సంప్రదించగా వారి ప్రత్యేక చొరవతో బాధితులందరికీ సీఎం సహాయనిది చెక్కులను వారికి అందించడం జరిగింది. వారి ఆదేశాల మేరకు బుధవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 17 మంది బాధితులకు రూ. 337500 విలువైన చెక్కులను బాధితులకు, బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటన్న యాదవ్, మన్యం, కృపాకర్ రెడ్డి, విజయ్ గౌడ్, పాతపల్లి చంద్రశేఖర్, ఎల్లస్వామి నాయుడు, నవీన్ గౌడ్, రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాగి అక్షయ్ కుమార్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, ఎండి ఇర్ఫాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రోహిత్ ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు, పి.అనిల్ మండల యుత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆరీప్, శివ కూమార్, శాఖపురం తిరుపతయ్య, అయ్యవారిపల్లి కురుమూర్తి, బొట్టు శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

## సాంప్రదాయ పద్ధతిలో
## ఉత్సవాలు జరుపుకోవాలి : సీఐ శివకుమార్

**ఆత్మకూర్ ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాబోయే గణేష్ ఉత్సవాలకు సంబంధించి యువతి యువకు లు ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా సాంప్రదాయ పద్ధతిలో గణేష్ ఉత్సవాలు జరుపుకో వాలని ఆత్మకూర్ సిఐ శివకుమార్ ఎస్సై నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రోజు ఆత్మకూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలో గణేష్ మండపాలు ఏర్పా టుచేసేందుకు ముందస్తుగానే పోలీసు అనుమతి తీసుకోవాలని మంటపం నిర్మాణం కోసం తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసి ఉండాలని సూచించారు. అంతేకాకుండా మట్టి విగ్రహాల ఏర్పాటుకు యువతీ యువకులు ప్రోత్సాహం చూపాలని కలశత వాతావరణం లేకుండా గణేష్ ఉత్సవాలను జరుపుకు నేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. గణేష్ మంట పాల వద్ద విద్యుత్ వినియోగానికి సంబంధించి తప్పనిసరిగా విద్యుత్ అధికారులు దగ్గర అనుమతి పత్రం తీసుకోవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. గణేష్ నిమజ్జనం పురస్కరించుకొని ఇతర మతాలకు సంబంధించిన ప్రార్థన స్థలాల ముందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా మంటపాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని గొడవలు జరిగిన పక్షంలో మంటపం నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చ రించారు. ఈ సమావేశానికి పట్టణంలోని మంటపాల నిర్వహకులతో పాటుగా పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మమ్మేలుకో... అమ్మ కరుణ రూపిణి

**- ప్రారంభమైన గెల్వలాంబ మాత ఉత్సవాలు**



ఆలయ సన్నిధికి ఆవు దూడను అందిస్తున్న మన్యం తిరుపతయ్య కుటుంబ సభ్యులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు శ్రీ బచ్చు రామకృష్ణ, ఉప్పు ఆంజనేయులు, పీఆర్ఓ మిర్యాల రాజయ్యలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



ఉత్సవాల్లో భాగంగా సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

**వంగూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** కరుణించు.. కాపాడు తల్లి అంటూ వంగూరు మండల కేంద్రంలో శాలీవాహనులు నజర్ బోనం, వైశ్యులు బోనాలతో అమ్మవారికి సమర్పించారు. గెల్వలాంబ మాత బోనాలు ప్రతి ఏటా అనవాయితీగా నిర్వహించడం ఈ ప్రాంత ప్రజల సుఖ సంతోషాలతో కూడి ఉంటుంది. అమ్మవారి ఉత్సవాలు అంగరంగా వైభవంగామొదటి రోజు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభానికి పలువురు అతిథులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ కరుణించి ఈ ప్రాంత ప్రజలను ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండే విధంగా కాపాడాలంటూ పలువురు అమ్మవారిని వేడుకున్నారు. వంగూరు మండల ప్రజల ప్రగాఢ నమ్మకమైన గెల్వలాంబ మాత ఉత్సవాల్లో పాల్గొని శ్రావణమాసంలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని పలువురు పేర్కొన్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లిస్తే ఆమె కరుణ కటాక్షలు పొందవచ్చునని పలువురు పేర్కొంటుంటారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కుబడిగా మొక్కును తీర్చుకునేందుకు ఉల్లంపల్లి గ్రామానికి చెందిన మన్యం తిరుపతయ్య ఆవుదూడను అందించారు.కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**

వంగూరు మండల కేంద్రంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు,వార్తదినపత్రిక నాగర్‌కర్నూల్‌జిల్లా స్టాఫర్ శ్రీ బచ్చురామకృష్ణ, వెల్దండ మండల ఆర్య వైశ్య మభసభ అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, పీఆర్ఓ మిర్యాల రాజయ్యలను అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని బోనాల ఊరేగింపు, జాతరను తిలకించారు.ఆలయానికి విచ్చేసిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు,వార్తదినపత్రిక నాగర్‌కర్నూల్ జిల్లాస్టాఫర్ శ్రీబచ్చురామకృష్ణ,ఉప్పు ఆంజనేయులు, మిర్యాల రాజయ్యలను ఆలయ చైర్మన్ నకినమోనిశేఖర్ ముదిరాజ్,గ్రామపెద్దలు పూల మాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఉత్సవాల్లో కోలాటాలు నిర్వహిస్తున్న దృశ్యం

## స్థాయికి మించి విమర్శలు చేయడం బీజేపీ నాయకులకు తగదు

**కల్వకుర్తి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలో మరియు పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బిజెపి పార్టీ నాయకులు కొంతమంది విమర్శలు చేయడాన్ని ఖండించిన కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌పై స్థాయికి మించి విమర్శించడం బీజేపీ నాయకులకు తగదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు మిర్యాల శ్రీనివాస్‌రెడ్డిలు హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ రోజు కూడా బీజేపీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడిన దాఖలాలు లేవు కానీ, ప్రజల కోసం నిరంతరం శ్రమించే బృంగి ఆనంద్‌కుమార్‌ని విమర్శించే స్థాయి మీకు ఉందా అని వారు ప్రశ్నించారు. బిజెపి పార్టీ నాయకులు చావు బతుకుల మధ్యలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆదుకున్న వారిపైన మీరు మాట్లాడడం ఎంతవరకు సబబు అన్నారు. కల్వకుర్తి పట్టణ ప్రజలు గుర్తుపట్టని వ్యక్తి, బిజెపి పార్టీలో చైర్మన్ అభ్యర్థి అని చెప్పుకోవడం బీజేపీ నాయకులకు సిగ్గు అనిపించడం లేదన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో మీరు ఎక్కడ పోటీ చేస్తారో చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో 7 మంది కౌన్సిలర్లు గెలవడం జరిగిందని, మీకు ఒక సీటు వచ్చిన విషయం గుర్తుంచుకోవాలని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కేటాయించిన విషయంలో పార్టీలకతీతంగా బిజెపి నాయకులకు కూడా చోటు కల్పించామని, అలాంటి వ్యక్తిపైన మీరు నిందలు వేయడం మాని అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమయితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, పుస్తకాల రాహుల్, వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎజాస్, గోరేటి శ్రీనివాసులు, మబ్బు రామరాజు, చిన్న, రవి, చిత్తారి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేష్మ, రెహానా, జమ్ముల శ్రీకాంత్, సంతుయాదవ్, సోఫి,ఆరిఫ్,దాస్యనాయక్, తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## రైతు సంఘం ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దగ్ధం

**నారాయణపేట టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 సుంకాన్ని విధించడాన్ని భారత సమాజం ఖండించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన గొప్ప హిట్ ఇండియా ఉద్యమం యొక్క 83వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఎన్‌సి క్విట్ ఇండియా, కార్పొరేట్లు వ్యవసాయ రంగాన్ని విడిచిపెట్టండి అనే నినాదంతో సంయుక్తా కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం ప్రత్యక్షంగా పరోక్షంగా రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతిస్పందనగా భారతదేశం నుండి దిగుమతులపై యుఎస్ఏ అదనంగా 25 సుంకం విధించడాన్ని సంయుక్తా కిసాన్ మోర్చా తీవ్రంగా నిరసిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో లేనంత అత్యధికంగా భారత ప్రజలపై ఆర్థిక ఆంక్షలుగా సంయుక్త కిసాన్ మోర్చా భావిస్తుందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోవద్దని, భారత ఆర్థిక వ్యవస్థపై విధించిన ఈ ఆర్థిక అంశలకు వ్యతిరేకంగా రైతులు కార్మికులు ప్రజలందరూ ర్యాలీ చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, కొండ నర్సింలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, హాజీ మలన్, అరుణోదయ జిల్లా కార్యదర్శి అంజి, జిల్లా కార్యదర్శి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి...

**కల్వకుర్తి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో బుధవారం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా తిరంగా ర్యాలీ కన్వీనర్ ధన్నోజు నరేష్ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ చారి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ భారతదేశంలోని భారతీయులందరిని కులమతాలకతీతంగా ఒకే తాటిపై నిలబడేలా సంకల్పం చేశారు. భారతదేశంలోని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని, ప్రతి భారతీయుడు భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, ఈ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మరోసారి తెలుసుకోవాలని, దేశ ప్రజలందరూ సంఘటితంగా ఐక్యంగా ఉన్నప్పుడే భారతదేశం ప్రపంచంలో విశ్వ గురువుగా నిలుస్తుందని దేశ ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు సూర్యకృష్ణ గౌడ్, నీరుకంటి రాఘవేందర్‌గౌడ్,నరెడ్ల శేఖర్‌రెడ్డీ,బోడనర్సింహా, పాలకూర్ల రవిగౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బృంగి వివేకానంద, నాయకులు కొల్లూరి శ్రీధర్, అభిగౌడ్, నరేష్ గౌడ్, నాప శివ, లక్ష్మినరసింహ, వాకిటి శ్రీకాంత్,ఏబీవీపీ నాయకులు ప్రశాంత్ యాదవ్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## చినుకు పడిందా.. ఉసురుతున్న ప్రభుత్వ కార్యాలయాలు

**చిన్నచింతకుంట, ఆగస్టు 13 ప్రభాతవార్త :** చిన్నపాటి ముసురు వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాలు ఉసురుతున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాలు ఎన్నో ఏళ్లుగా వర్షాలకు ఉసురుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆయా శాఖల అధికారులు వాపోతున్నారు. వర్షాలు కురిశాయంటే వరండాలు, సిబ్బంది ఉండే కార్యాలయాలు ఉసురుతుండడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇటు తహసిల్దార్ కార్యాలయం అటు మండల పరిషత్ కార్యాలయం చుక్క చుక్క నీరు పడుతూ తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో పైకప్పు ఎత్తుతగ్గులుగా వేయడంతో వర్షం నీరు నిల్వ ఉండడంతో గదులు ,వరండాలు ఉసురుతున్నాయని, భవిష్యత్తులో పెచ్చులు ఊడే ప్రమాదం కూడా ఉందని కార్యాలయాలకు వచ్చే మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నత స్థాయి అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి ప్రభుత్వ కార్యాలయాలను మరమ్మత్తులను చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయం గుమ్మానికి నీరు కారుతున్న దృశ్యం



వర్షానికి ఉసురుతున్న ప్రభుత్వ కార్యాలయ వరండా

## పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎస్పీ



పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** రేపు ఆగస్టు 15స్వతంత్రదినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ బుదవారం పరిశీలించారు. రానున్న రెండు రోజులలో భారి వర్షాలు ఉన్నందున స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రెవెన్యూ అధికారులతో కలిసి తగు ఏర్పాట్లను చేయాలని, పరేడ్ మైదానంలో సాయుధ పోలీసుల కవాతును బాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలను తిలకించడానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు అన్ని ఏర్పాట్లుచేయాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐలు ఉన్నారు.

## ముగ్గురు స్పెషల్ డ్రైవ్ సిబ్బంది

**మద్దూర్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో వర్షాల కారణంగా మున్సిపాలిటీలో ముగ్గురునీ స్పెషల్ డ్రైవ్ సిబ్బందిగా నియమిస్తున్నట్లు కమిషనర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పురాతన నాటి ఇల్లు ఎవరివైనా ఉంటే వెంటనే వాటిని కాల్ చేసి ప్రభుత్వ కార్యాలయాల్లో లేదా ప్రభుత్వ పాఠశాలలో ఈ వర్షాలు తగ్గేవరకు ఉండాలని కమిషనర్ మున్సిపాలిటీ ప్రజలను కోరారు. అత్యవసరం అయితే వెంటనే మున్సిపాలిటీ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే సహకారంతో
## సీఎం సహాయనిధి అందజేత

**వెల్దండ, ఆగస్టు 13 ప్రభాతవార్త:** మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాదుగుల రాజేశ్వరి అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ దృష్టికి తీసుకుపోవడంతో మంజూరైన రూ.40 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం కేశమల్ల కృష్ణ బాధితురాలికి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, మెంటల్ శ్రీను, వెంకటయ్య, ప్రవీణ్‌నాయక్, హరిలాల్‌నాయక్, జంగయ్య, గణేష్, మాధవులుతో పాటు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో
## మరణించిన ఏఈ శివరాజు

**ఉట్కూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండలం పరిధిలోని బిజ్వార్ గ్రామానికి చెందిన ఏఈ శివరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విగ్నేశ్వర రెడ్డి అన్నారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకులు యజ్ఞదత్, అశోక్, యాదయ్య బిజ్జారం, గ్రామంలోని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రీనివాస్ రెడ్డి, నాగేష్ గౌడ్, వెంకటేష్, ముదిరాజ్ లొట్టి, కేశవులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వర్ష విపత్తు నుంచి
## పశుసంపదను కాపాడుకోవాలి

**ఉప్పునుంతల ఆగస్టు 13 ప్రభాతవార్త :** రానున్న మూడు రోజుల్లో రాష్ట్ర వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక నేపథ్యంలో రైతులు పశుపోషకులు, మేకలు, గొర్రెలు, పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తల ద్వారా పశుసంపదను కాపాడుకోవాలని పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షం విపత్తు సమయంలో పశు సంరక్షణ కోసం పశువులను ఎత్తైన ప్రాంతాలలో సురక్షితమైన షెడ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. పశువులకు శుభ్రమైన మేత తాగునీరును అందుబాటులో ఉంచుకోవాలని ,మీ ప్రాంతాలను వరద హెచ్చరికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లను తీసుకోవాలన్నారు. మేత కోసం గొర్రెలు, మేకలను వాగులు, వంకలు చెరువుల వద్దకు తీసుకు వెళ్ళవద్దని హెచ్చరిస్తున్నారు. పశువులను గుంపులు గుంపులుగా కాకుండా విడివిడిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టి వేయకూడదని సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు చెట్ల కింద కాకుండా సురక్షిత ప్రాంతాల్లోకి చేరుకోవాలన్నారు. సరైన అవగాహనతో ముందు జాగ్రత్త చర్యలలో పశుసంపదను కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఓపెన్ ప్లాట్ల యజమానులకు పెనాల్టీ

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పరిస్థితి దృష్ట్యా సెలవులను కూడా రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎస్.డి.ఆర్.ఎఫ్.20 మంది టీం,గ్రామాల్లో ఆపద మిత్ర వాలంటీర్ల సేవలు అత్యవసర పరిస్థితిలో వినియోగించు కోవాలన్నారు. చేపల వేట, ఈత కోసం చెరువులు, కాలువలు, రిజర్వాయర్లలోకి దిగకుండా కట్టడి చేయాలని,అవసరమైన చోటపోలీసు బందోబస్తు, పికెటింగ్ లను ఏర్పాటు చేయించాలని ఆదేశం చారు. జిల్లాలో 27 ప్రాంతాలలో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నటు గుర్తింపు. భారీ వర్షాల వల్లఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, తక్షణమే స్పందిస్తూ పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా సిబ్బందిని క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్కో ఎస్.ఈ.నిఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,సబ్ సెంటర్లు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది విధుల్లో అందు బాటులో ఉండాలని, అవసరమైన ఔషధ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ళలో ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలనుసురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు.భారీవర్షాలు, పిడుగుపాటు వల్ల మూగజీ వాలకు సైతం ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నందున, ఈ విషయం రైతులను, పశువుల పెంపకందార్లను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, వైద్యారోగ్యం, వ్యవసాయ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కుళ్ళిన పదార్థాలు.. కాలం చెల్లిన రసాయనాలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

బేకరీ నిర్వాహకులపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్స్ లేకపోవడంపై అపరి శుభ్ర వాతావరణంలో తినుబండారాలను తయారు చేయడం, కాలం చెల్లిన కెమికల్స్ క్రీమ్లను వాడడం పట్లషాప్ యజమానికి నోటీసులు జారీ చేశారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చేవరకు బేకరీ మూసి వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ మాట్లాడుతూ.. ఘటనపై కూడా నోటీసు జారీ చేశామనిచ ఏడు రోజులలోగా బేకరీ యజమానిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని చెప్పారు. పట్టణంలో ఎక్కడైనా సరే లైసెన్స్‌లేకుండా బేకరీలు,హోటల్స్ నిర్వహిస్తే చర్యలు చేపడ తామని హెచ్చరించారు.

## జడ్చర్లలో ఉద్రిక్తత..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పాల్గొనేందుకు హాజరైన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విషయం తెలుసుకొని సిగ్నల్‌గడ్డ వద్దకు చేరుకు న్నారు. పలుకుల సంగాల నాయకుల కోరిక మేరకు మొదట పంద్రాగస్టు జండా ఆవిష్కరణ వరకు విగ్రహాల తొలగింపు చేపట్టొద్దని సూచించారు. అయితే అప్పటికే నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాల తొలగింపు చేశామని ఈరోజు అంబేద్కర్ పూలే విగ్రహాలను కూడా అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలనిఅధికారులు తేల్చి చెప్పడంతోలక్ష్మారెడ్డి పలుకుల సంఘాల నాయకులతో చర్చించారు. వారికి నచ్చ చెప్పారు. విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసుకుందామని అన్ని సంఘాల నాయకులను ఒప్పించారు. పట్టణ అభివృద్ధి కూడా అవసరమని అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించడం సరైన పద్ధతి కాదని నాయకులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో సాయంత్రం ఐదు గంటలఅనంతరం అంబేద్కర్ పూలే విగ్రహాలనుకూడా భద్రంగా అక్కడినుంచి తొలగించి కార్యాల యంలోఉంచారు.ఎలాంటి అవాంఛనీయఘటనలు జరగకపోవడంతోఅంతా ఊపిరి పీల్చుకున్నారు.

## వ్యక్తిత్వ వికాసం నిస్వార్థ సేవపై సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి

**నారాయణపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని బుధవారం అంజనా గార్డెన్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం నిస్వార్థ సేవపై అవగాహన సదస్సు నిర్వ హించారు. శ్రీసత్య సాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సత్యసాయి జిల్లా కన్వీనర్ చిట్టెం మాధవరెడ్డి, చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత ముఖ్య అతిథులుగా శౌర్య చక్ర గ్రహీత కల్నాలు ఎంబు శంకర్, ప్రొఫెషనల్ శిక్షకులు మీటివేటర్ మల్లేష్ బాలీవుడ్ గాయకుడు శ్రీ సాయిరాం హాజరయ్యారు. వివిధ కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నిస్వార్థ సేవ వ్యక్తిత్వం వికాసానికి ముఖ్యమైన పునాది అని క్రమశిక్షణ నిజాయితీ సానుభూతి వంటి విలువలు సేవాభావం ద్వారా అభివృద్ధి చెందుతాయని దీనివల్ల సమాజంలో సానుకూల మార్పులు వస్తాయని చిన్నచిన్న సేవా కార్యక్రమాలు వ్యక్తి ఆత్మ సంతృప్తికి సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎలా ఎదగాలో వివరించారు. వారానికోసారైనా సేవాదినాన్ని పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి ట్రస్టు సభ్యులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు నివారించాలని పోస్టర్ విడుదల

**నారాయణ పేట, ఆగస్టు13 ప్రభాతవార్త:** నారాయణపేట మండల పరిధిలోని అపక్ పల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రి సిబ్బంది,వైద్య కళాశాల విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. సే నో డ్రగ్స్ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతూ చేపట్టిన ఈ కార్యక్రమం యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దీనికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని కోరారు, డ్రగ్స్ రహిత జీవన శైలిని అలవర్చుకోవాలని, మనమే డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ మన చుట్టు పక్కల ఉన్న వారిని కూడా డ్రగ్స్‌కు అలవాటు పడకుండా వారికి అవగాహన కల్పించాలి. ఎవరైనా డ్రగ్స్‌కు బారిన పడిన వారి సమాచారం సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి, కొకైన్, వంటి డ్రగ్స్ చెడు స్నేహితుల వల్ల, ప్రభావితం కావడం జరుగుతుంది. అటువంటి వారిని దూరంగా ఉండాలి అని వారు తెలిపారు. కళాశాలలో కానీ ఆసుపత్రిలో కానీ ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియో గిస్తున్నట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలకు తీసుకుంటామని హెచ్చ రించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.కిరణ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. ఆదిత్య, డా.నజ్మా, ఆర్ఎంఓ డా.రాఘవేందర్,ఆఫీస్ సిబ్బంది ప్రవీణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ , నర్సింగ్ ఆఫీసర్‌లు, వైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాల పరిశీలన

**నారాయణపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం పరిధిలోని కోటకొండ గ్రామం లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను సందర్శించి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం అంచనాలు తీసుకున్నారు. ఎంపీడీవో సుదర్శన్, విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్‌లు ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం అయిన ప్రభుత్వ భవ నాల పైన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం గురించి వివరించారు. సోలార్ విద్యుత్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చాణక్య రెడ్డి, పాఠశాలలప్రధానోపాధ్యాయులు సునీత, నసీరుద్దీన్, స్థానిక నాయకులు ఎడ్లరాజు, సోడం సుధాకర్, పంచాయతీ వర్కర్స్ నర్సింహులు, రామచందర్ మొదలైన వారు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

**దేవరకద్ర, ఆగస్టు 13 ప్రభాతవార్త:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ఒకవైపు రైతుకు ఆనందాన్ని ఇస్తుంటే యూరియా కొరత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. పంటలకు వేయడానికి రైతులు సహకార సొసైటీల వద్ద గంటల తరబడి అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు.గంటల తరబడి నిలబడిఉన్న ఒక ఆధార్ కార్డు కు రెండు బస్తాలతో సరిపెడు తున్నారని సరైన సమయంలో యూరియా దొరకక పోతే తమ పంటలు దెబ్బతింటాయని భారీ నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. బుధవారం దేవరకద్ర మండల కేంద్రంలోని సొసైటీ దగ్గర యూరియా అయిపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు యూరియా కోసం గ్రోమోర్‌సెంటర్ వద్దలైన్లో నిల్చొని ఆధార్ కార్డు చూయించి ఒక్కరికి రెండు బస్తాలే తీసుకుని వెళ్లాలని రైతులు తెలిపారు. యూరియా కొరత ఉండటంతో ప్రవేట్ దుకాణదారులు రెగ్యులర్‌గా వారి దుకాణానికి వచ్చే వినియోగదారులకు మాత్రమే ఇస్తున్నారని సమాచారం. యూరియాను సకాలంలోఅందే విధంగాచర్యలు తీసుకోనిమా పంటలను కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.



యూరియా కోసం క్యూ లైన్లలో వేచి ఉన్న రైతులు

# శ్రీశైలం డ్యాం 7 గేట్లు ఎత్తివేత

- ◆ 882 అడుగులకు చేరిన నీటిమట్టం
- ◆ కుడి,ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి
- ◆ జూరాలకు 90 వేలక్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 13, ప్రభాతవార్త:** శ్రీశైలం జలా శయానికి వరద క్రమంగా పెరుగుతున్నది. సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో 7గేట్లు 10 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 36,628క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 54,352క్యూసెక్కులు,సుంకేసుల నుంచి 42,669 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,37,399క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకుగానూ 882.70 అడు గులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 202.050టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,89,651క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,651 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. అదేవిధంగా ఉమ్మడి పాలమూరులోని జూరాలకుఎగువన కర్ణాటకలో కురుస్తు న్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశ యానికి 90,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.284టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 36,628 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 54,352క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా ఆర్డీఎస్‌కు 50 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 91,340క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## భారీ వర్షాల పట్ల విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి

- ◆ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వం లక్ష్యం
- ◆ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త:** గ్రామాల్లో, మండలాల్లో, పట్టణాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా లైన్‌మెన్లు ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతర విద్యుత్ సరఫరాలను అందజే యాలని పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో నెలకొని ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేం దుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని తెలిపారు. అందుకు అవసరమైన విద్యుత్ పోల్స్ ట్రాన్స్ఫార్మర్లు, వైర్లు, వెంటనే సమకూర్చి తగువిధంగా ఏర్పాటు చేయాలని, అను గుణంగా ప్రతిపాదన సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకుని వస్తే మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజలకు నిరంతరం విద్యుత్తు సరఫరా చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుంది, కాబట్టి క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయంలేకుండా బాధ్యతయుతంగా విధులు నిర్వహిం చాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ, అధికా రులు, ఏడిఈ, ఏఈలు, లైన్‌మెన్లు, పాల్గొన్నారు.

## ఎండీ.షరీఫ్ ఖాన్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: అచ్చంపేట ఎమ్మెల్యే



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**వంగూరు, ఆగస్టు13 ప్రభాతవార్త:** వంగురు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎండీ.షరీఫ్ ఖాన్ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందరనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. షరీఫ్‌ఖాన్ తన తండ్రి ఆశయ సాధనకోసం వంగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి తన వంతు కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూ ఎమ్మెల్యే వంశీకృష్ణతో సత్సంబంధాలను కొనసాగిస్తూ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. ఇలాంటి కరుడు గట్టిన కాంగ్రెస్ కార్యకర్త అతి చిన్న వయస్సులో మృతి చెందడం చాలాబాధకరమని, పార్టీకి తీరనిలోటు అని అచ్చం పేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. అనం తరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుడిసోదరుడు యూసుఫ్‌ఖాన్‌తో పాటు కుటుంబ సభ్యుల ను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు. అనంతరం ఎండీ.షరీఫ్ ఖాన్ అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్, నాయకులు అల్వాల్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, హమీద్, రాజేందర్‌రెడ్డి, క్యామ పరుశరాములు, వెంకటయ్య యాదవ్, యాదగిరి రావు, చంద్రశేఖర్, శంకర్, రఫి, గఫూర్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న 3వ విడత మెగా సర్జికల్ క్యాంప్

**వంగూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సర్జికల్ క్యాంపులో భాగంగా బుధవారం 80 మందికి ఆపరేషన్లు నిర్వ హించినట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఈ ఆగస్టు చివరివరకు మెగాసర్జికల్ క్యాంపు కొనసా గుతుందన్నారు. అచ్చంపేట నల్లమల్ల ప్రాంత ప్రజలు ఇంకా ఎవరైనా పేర్లునమోదు చేసుకొని వారుఉంటే నమోదు చేసుకొని ఈయొక్క మెగా సర్జికల్ క్యాంపును సద్వినియోగం చేసుకో గలరని తెలిపారు.బుధవారం నాటికి 152 మందికి శాస్త్ర చికి త్సలు చేయడంజరిగిందని, మెగా సర్జికల్ క్యాంపుకు విజయ వంతంగా కొనసాగడానికిసహకరిస్తున్న వారికి ఎమ్మెల్యే కృతజ్ఞ తలు తెలిపారు.క్యాంపులో సూపర్డెంట్ డాక్టర్ ప్రభు, డిప్యూటీ డిఎంహెచ్ఓ తారాసింగ్,డాక్టర్ ప్రదీప్, మహేష్, స్టాఫ్‌నర్స్ ,థియేటర్ అసిస్టెంట్లు,పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్‌ను నిషేధిద్దాం

**ఎన్‌విఎస్ కళాశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్**



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు13 ప్రభాతవార్త:** విద్యార్థిని, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవు తుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం ఎంవిఎస్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్య క్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులచే మొదట వేల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలల్లో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీలు చురుగ్గా పని చేయాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత స్థానంలో నిలవాలని, ఇందుకు బాగా కష్టపడి చదవాలని అన్నారు. విద్యా ర్థులు బయట ప్రపంచంలో చెడు అలవాట్లకు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఇలా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, ఎంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పద్మావతి, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

- ◆ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ◆ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర/భూత్పూర్, ఆగస్టు13 ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి బుధవారం వార్త దినపత్రికతో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు నాలుగురోజుల పాటు భారి నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఊక చెట్టు వాగు, పెద్దవాగుల వరద ప్రవాహం, ప్రస్తుత పరిస్థి తిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. సరళ సాగర్‌కు వరద పెరిగి ఆటోమెటిక్ సైఫాన్లు తెరుచుకోవడంతో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నేడు పూర్తిస్థాయిలో కోయిల్ సాగర్ నిండి గేట్లు తెరిచే అవకాశం ఉన్నందున,కోయిల్ సాగర్ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యసరమైతే తప్ప ప్రజలు ఇండ్లలో నుండి బయటకు రావద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్నఇళ్లలో ఎవరు ఉండరాదని ఎమ్మెల్యే సూచిం చారు. పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఎవరు నీటిలోకి వెళ్లొద్దని తెలిపారు. మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, షార్ట్ సర్క్యూట్ వచ్చేఅవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు.

## సిపిఆర్‌తో మనిషికి పునర్జన్మ

**వనపర్తి రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** సీపీఆర్‌తో మనిషికి పునర్జన్మ లభిస్తుందని, సీపీఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారి సీతారాం నాయక్, జిల్లా సిపిఆర్ ఇన్స్ట్రక్టర్ డా. మంజుల పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ల్లే శ్రీనివాసులు సూచనలతో జిల్లా ప్రజా సంబంధాలఅధికారి సీతారాం నాయక్ ఆధ్వర్యం లో పత్రిక విలేకరులకు సీపీఆర్ (హృదయశ్వాస పునరుద్ధరణ) పైఅవగాహన శిక్షణ సదస్సును నిర్వహించారు.ఈ కార్య క్రమంలో జిల్లా ప్రజా సంబంధాల అధికారి సీతారాం నాయక్, జిల్లా సిపిఆర్ ఇన్స్ట్రక్టర్ డా.మంజుల హాజరై మాట్లాడుతూ గుండెపోటువచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందిం చడం వల్ల వారి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మి కంగా గుండెపోటుతోకుప్పకూలితే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామని సూచించారు. సీపీఆర్ చేసే విధానంపై విలేకరులకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రజలకు చేరవేయడంలో,పత్రికా విలేకరులు తమవృత్తి ద్వారా సహక రించాలని జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డా. రామచంద్ర రావు, నోడల్ అధికారి డా. రియా శ్రీ, జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

## వైభవంగా రంగనాయక స్వామి ఉత్సవాలు

**ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్**

**జడ్చర్ల, ఆగస్టు13 ప్రభాతవార్త:** శ్రావణ మాసాన్ని పురస్కరిం చుకుని మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మున్సిపాలిటీ పరిధి లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన పెద్దగుట్ట రంగనాయక స్వామి దేవాలయంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడుతున్నాయి. స్వామివారి వార్షిక జాతర కార్యక్ర మాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హారతులు, అన్నదాన కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి భాండారి శాంతికుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనతోపాటు పార్టీ ముఖ్య నాయకులు ప్రభాకర్ రెడ్డి, జక్క రఘునందన్, నడిమింటి శ్రీనివాస్, జిట్టా వెంకటేష్‌లు కూడా స్వామిని దర్శించుకున్నారు. అదే విధంగా స్థానిక బీజేపీ నేతలుగా సామల నాగరాజు, కందుర్ రమేష్, పిల్లి సూర్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి, కరాటే రవి, జగదీశ్,రవి ముదిరాజ్, ప్రశాంత్‌రెడ్డి, దోజర్ శివ, సుధీర్ రెడ్డి, బిజ్జులా అవినాష్ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న శాంతికుమార్, నాయకులు

## అరగంట శ్రమించి.. ప్రాణాలు రక్షించి..

**- సీఐ అప్పయ్యతోపాటు ఫైర్ సిబ్బందికి ఎస్పీ అభినందనలు**



ఎల్లమ్మను దవాఖానకు తరలిస్తున్న సీఐ అప్పయ్య, సిబ్బంది

**మహబూబ్‌నగర్, ఆగస్టు 13, ప్రభాతావార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలో కిద్వాయిపేట వైపు వెళ్లే దారిలోని పెద్ద కాలువలో పాతతోట మోండిగేరికి చెందిన ఎల్లమ్మ (50) అకస్మాత్తుగా పడిపోయింది. ప్రమాదవశాత్తు పెద్దకాలువలో పడడంతో గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100కి కాల్ చేయడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య అలర్ట్ అయ్యారు.ఫైర్ శాఖ సహకారంతో అధికారులు తక్షణమే స్పందించి ఆమెనుసురక్షితంగా బయటకు తీశారు.అనంతరం చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి తమకుసమాచారం అందకుంటే కాలువలో కొట్టుకుపోయే ప్రమాదం ఉండేదని సీఐ అప్పయ్య తెలిపారు. ఈ సందర్భంలో మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి వన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ అప్పయ్య ఫైర్ అధికారుల వేగవంతమైన స్పందన, మానవతా ధర్మం, సేవా భావాన్ని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

## లాడ్జిలో తలదాచుకొని రెక్కీ

- ◆ పోలీసుల అదుపులో వైన్ షాప్ దొంగతనం కేసు నిందితులు
- ◆ వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**జడ్చర్ల, ఆగస్టు13, ప్రభాతవార్త:** ఈనెల 7వ తారీఖున రాత్రి సుమారు 10:30 గంటల ప్రాంతంలో జడ్చర్ల సమీపంలోని నక్కల బండ తండా వద్ద బైక్‌పై వెళ్తున్న రిధి వైన్ షాప్ నిర్వాహకుడు అరుణ్‌రెడ్డిపై కారం చెల్లి డబ్బులు అపహరించిన ఘటనలో నింది తులను పట్టుకున్నట్లు డి.ఎస్.పి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధ వారం జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలోని రిధి వైన్స్ నిర్వాహకుడు అరుణ్‌రెడ్డి ఈనెల 7న రాత్రి పది గంటల సమయంలో షాపు మూసేసి తన నివాస ప్రాంతంఅయినా మహబూబ్‌నగర్ బైక్‌పై బయలుదేరాడు. అయితే కొంతకాలంగా జడ్చర్ల కొత్త బస్టాండ్‌లోని గగనా లాడ్జిలో నివాసం ఉంటూ రాకపోకలను గమనిస్తూ రెక్కీ నిర్వహించి బైకును ఫాలో చేస్తూ నక్కల బండ తండా వద్దకు చేరుకోగానే బైకును అడ్డ గించి బెదిరించి తమ వెంట తీసుకెళ్లిన కారంపొడిని అరుణ్‌రెడ్డి కళ్ళల్లో చల్లారు.అరుణ్‌రెడ్డి బ్యాగులో ఉన్న నగదును అపహరిం చారు.ఈమేరకు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం జాలి హిల్స్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమా నాస్పదంగా ఉన్నఇద్దరు వ్యక్తులను గమనించి పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి విచారించగా పూర్తి వివరాలు వెల్లడించారు. వీరన్న పేటకు చెందిన బాలాజీ రవితేజలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.72,500,ఒక సెల్ ఫోను, స్కూటీని రికవరీ చేశారు.మిగిలిన నగదుతో పాటు ఇతర విచారణ దర్యాప్తు కొనసా గుతుందని సిఐ కమలాకర్ తెలిపారు.

## ఆగి ఉన్న బైకులో నగదు దొంగిలించిన దొంగలు

**పెబ్బేరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో బుధవారం రోజు శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఎస్‌బిఐ బ్యాంకులో నగదు డ్రా చేసుకొని తన బైక్ లో ఉన్న టూల్ బాక్స్ లో పెట్టాడు. ఏఈ ఆఫీసులో పని ఉందని ముందర బైకు ఉంచి లోపలికి వెళ్లి వెంటనే తిరిగి రాగా అప్పటికే టూల్ బాక్స్ ఓపెన్ అయి ఉందని అందులో ఉన్న రెండు లక్షల ఇరవై వేల రూపా యలు కనిపించడం లేదని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగి లించారని బాధితుడు ఫిర్యాదు దారుడు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలియజేశారు.

## అధిక స్పీడ్‌తో ఢీకొన్న ఐదు వాహనాలు



వాహనాలు ఢీకొన్న దృశ్యం

**పెబ్బేరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో నేషనల్ హైవే రోడ్డుపై జోరు వాన కురుస్తుండగా ఒకదాని వెనుక మరోక వెహికిల్ ఇలా 5 వాహనాలు ఢీకొన్న ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులోని నేషనల్ హైవేపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముందుగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న రెండు వాహనాలు ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ఒక దాన్ని మరొకటి వెనక నుంచి ఢీకొట్టుకున్నాయి. వేనకాలే వస్తున్న మరో బొలెరో కొంచెం దూరంలో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అతివేగంగా వస్తున్న మరోకారు వెనుక నుంచి బొలెరోను ఢీకొ ట్టింది. అదేవిధంగా ఫాస్టుగా వస్తున్న ఓ భారీ ట్రక్కు కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆ కారు ముందున్న బొలెరోను ఢీ కొట్టుకొని రెండు భాగాలు డ్యామేజ్ అయ్యాయి. కాని కార్లలో ప్రయాణిస్తున్న ఏప్రయాణికులకూ ప్రమాదం జరగలేదు. పెనుప్ర మాదం తప్పి అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులకు సమా చారం అందడంతో వారు వాహనాలను పెబ్బేరు పట్టణం నుంచి మళ్లించి ట్రాఫిక్ జాంకాకుండా చూశారు. దాదాపు మూడు గంటల పైన వర్షం పడటంతో వాహనాలు భారీగా నిలిచిపోయి వాహన దారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన గణేష్ నాయక్ (ఫైల్)

**మద్దూర్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ట్రాక్టర్ పైనుంచి అదుపుతప్పి కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నాయక్ తండలో జరిగింది. వివ రాలు ఈ విధంగా ఉన్నాయి నారాయణపేట జిల్లా మద్దూరు మండలపరిధిలోని హనుమాన్ నాయక్ తండ నుంచి నందిపాడుకు ట్రాక్టర్‌పైరాళ్లు వేసుకొని వెళ్తుండగా రోడ్డు గుంతల మయంగా ఉండడం వలన ట్రాక్టర్ డ్రైవర్ గణేష్ నాయక్ అదుపు తప్పిట్రాక్టర్ ట్రైర్లకింద పడిపోవడంతో అక్కడికక్కడేమృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# మాదకద్రవ్యాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేసిన పోలీసులు


మద్దూర్: ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


భూత్పూర్ : ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, ఎస్సై ,విద్యార్థులు


ఖిల్లాగణపురం: విద్యార్థులచే ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ నరేష్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు13 ప్రభాతవార్త;** మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక, సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ, మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా ఎస్పియోగేష్ గౌతమ్ మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియశిలా భాగస్వామి అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తాను అని డ్రగ్స్ రహిత సమాజమేలక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. మాదకద్రవ్యాల వల్ల సమాజానికి ముఖ్యంగా యువతకు తీవ్ర నష్టం కలుగుతుందని జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయడం జరుగుతుందని, ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించడానికి పోలీసులు కఠినచర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ ని సమూలంగా నిర్మూలించాలని డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏండి రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నరసింహ, ఎస్ఐ సునీత, ఆర్ఎస్ఐలు శివశంకర్, కృష్ణ చైతన్య, శ్వేత, శిరీష, ఐటీ కోర్ స్టాఫ్, ఆర్ముడు రిజర్వు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మద్దూర్, ఆగస్టు13 ప్రభాతవార్త:** మత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లోని ప్రతి ఒక్క పౌరుడు మాదక ద్రవ్యాలను నిరోధించడంలో భాగస్వామికావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మున్సిపాలిటీ పౌరులను కోరారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితోనే బుధవారం మున్సిపల్ కార్యాలయం దగ్గర ప్రతిజ్ఞ చేయించారు. తన దృష్టికి ఏమి ఇంత వచ్చినా వెంటనే వారిపై చర్యలుతీసుకోవడానికి సంబంధిత అధికారులకు సమాచారం పంపిస్తానని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**భూత్పూర్, ఆగస్టు13, ప్రభాతవార్త:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని బుధవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించినప్పుడే సమాజం బాగుపడుతుందని పేర్కొంటూ సీఐ రామకృష్ణ, ఎస్సై చంద్రశేఖర్ లు పోలీసుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, ఏ ఒక్కరూడ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషిచేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తులసమాచారాన్ని సంబంధితఅధికారులకు తెలుపుతానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామినవుతానని సీఐ, ఎస్సైలతో పాటు పోలీసులు ప్రతిజ్ఞ చేశారు.

**ఖిల్లాగణపురం, ఆగస్టు13, ప్రభాతవార్త:** విద్యార్థులు మాదకద్రవ్యాలు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దొంతికుంట తండా సమీపంలో ఉన్న మోడల్ పాఠశాలలో ఆయన విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాలలో కూడా విద్యార్థులు యువకులు డ్రగ్స్ కులలవాటు పడుతున్నారని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కు అలవాటు పడితే వాళ్ళ జీవితాలు నాశనం అవుతావని హెచ్చరించారు. డ్రగ్స్ అమ్మకాల గురించి ఎవరికి సమాచారం తెలిసిన పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు తెలియజేశారు. మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులచే ప్రమాణంచేయించారు. ప్రిన్సిపల్ ఉమాదేవి, కానిస్టేబుల్ రాజు అంజి పుష్పలత విద్యార్థులు పాల్గొన్నారు.

**వీపనగండ్ల ఆగస్టు13, ప్రభాతవార్త:** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చదువుపై ఆసక్తి కనపరచాలని వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి శి గౌడు సీనియర్ లెక్చరర్ బి లక్ష్మీ నారాయణ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు విద్యార్థులను కోరారు. బుధవారం నాడు నషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం కళాశాల యందు నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కు విద్యార్థులు లోన్ అవుతూ వాటి వలన చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని వారు తెలిపారు. చెడు అలవాట్లు ఉన్న విద్యార్థులను మంచి దారిలో పెట్టేతందుకోసం కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ కల్పన అధ్యాపక అధ్యాపకతర సిబ్బంది తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమము జిల్లా కలెక్టర్ మరియు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ డైరెక్టర్ ఆదేశానుసారం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ సంబంధించి మరిఎన్నో విషయాలు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు తెలియజేశారు.

**దేవరకద్ర, ఆగస్టు 13 ప్రభాతవార్త:** గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని దేవరకద్ర ఎస్సై నాగన్న విద్యార్థులకు సూచించారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని భవిత జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి మత్తు పదార్థాలకు బానిసై భవిష్య త్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. తాత్కాలిక ఆనందం కోసం కుటుంబాలను దూరం చేసుకోవద్దన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయించే వారి, సమాచారాన్ని ఇస్తే సమాచారాన్ని ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని, వారికి రక్షణ కల్పిస్తామని, ప్రజలందరూ భాగ్యస్వాములు కావాలని తెలిపారు. అనంతరం గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపల్ సతీష్


వీపనగండ్ల: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


దేవరకద్ర: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## ఘనంగా నరసింహ స్వామి 102వ ప్రతిష్టాపన వేడుకలు

**నారాయణపేట టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం పళ్ల రాఘవేంద్రస్వామి ఆలయంలో బుధవారం షోడశ బాహు లక్ష్మీనరసింహస్వామి 102 ప్రతిష్టాపన ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహాచారి, అనిల్ దేశాయి ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. విద్వాన్ హరీషా చారి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ నరసింహస్వామి మహిమలను కొనియాడారు. ప్రతిఒక్కరు సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. లక్ష్మీశోభన భజన మండలి సభ్యులు హరిదాసుల సంకీర్తనల మధ్య పల్లెకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు బీంషన్‌రావు, అనిరుద్ధ, నరహరి, రాఘవేంద్ర, శేషు, ధరణిధర్, నరసింహ, ప్రహ్లద, శ్రీహరి, మంజునాథ జోషి, తదితరులు ఉన్నారు.

## 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నారాయణ పేట, ఆగస్టు13 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలో ఆగస్టు 16వ తేదీ శనివారం రోజు జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ స్థాపన దివాస్ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలు సురేఖ రాంబాబు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేడుకలో భాగంగా 16న ఉదయం 10 గం.లకు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడి శ్రీకృష్ణ దేవాలయంలో పూజా కార్యక్రమాలు, అలాగే సెంటర్ చౌక్‌లో కాషాయ పతాక ఆవిష్కరణ, సాయంత్రం పాలవుట్ల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షులు మురళి భట్టడ్, ప్రవీణ్, శ్రవణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** ఈ నెల 16 న జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి రావాలంటూ ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక నారాయణపేట, మక్తల్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే పర్ణిక రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఆగస్టు నెల 16వ తేది నుండి 23వ తేదీ వరకు 8రోజుల పాటు వేడుకలు జరుగుతాయన్నారు. ఈ నెల 23న మోనప్ప కాలనీ వద్ద వేడుకలుఆగస్టు 23నఊరేగింపు నిర్వహిస్తారన్నారు. ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందించిన వారిలో ఉత్సవ కమిటీ, సభ్యులు ఈశ్వరయ్య, రామ్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి స్కూల్‌లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నారాయణ పేట, ఆగస్టు 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయి స్కూల్లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ వేసి ఉట్టికొట్టే కార్యక్ర మంలో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్ని కృష్ణులు పోటాపోటీగా ఉట్టి కొట్టుటకు పరిగెత్తుతుంటే దాన్ని చుట్టూ గోపికలు చప్పట్లు కొడుతూ వారిని ప్రోత్సహించే దృశ్యాలు చూపరులకు ఎంతోఆనందాన్ని కలిగించాయి. పాఠశాల ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలప్ప, అమీనా, హెచ్. నర్సింహా, సురేందర్ గౌడ్, సునీల్ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని మండల విద్యాధికారికి వినతి

**మక్తల్ టౌన్, ఆగస్టు13 ప్రభాతవార్త:** మాధ్వార్ గ్రామ (ఎంపీపీఎస్) పాఠశాలల్లో గత కొంతకాలంగా డిప్యూటేషన్ సమస్య గత సంవత్సరం ఒక ఉపాధ్యాయని డిప్యుటేషన్ పై పంపినందున మా గ్రామంలోని విద్యార్థులకు చాలా నష్టం జరిగే అవకాశం ఉందని, మాపాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య116 ఉండగా అందులో అధికశాతం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య నష్టం పోకుండా ప్రభుత్వ నియమాల ప్రకారం మా పాఠశాలకు కేటాయించిన నలుగురు ఉపాధ్యాయులును ఎట్టి పరిస్థితిలోనూ కదిలించవద్దనీ ,డిప్యూటేషన్ వేసిన రవీందర్ రెడ్డిని కూడా డిప్యూటేషన్ రద్దుచేసి మాపాఠశాలలోనే పూర్తి స్థాయిలో ఉండాలని కోరుతున్నామని అన్నారు. గ్రామంలో పెద్దలు, యువకులు, మరియు పాఠశాల చైర్మన్ విజ్ఞప్తి మేరకు మాగ్రామ విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చేయాలని మండల విద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి కర్నె, శ్రీనివాస్ ఆర్ఎంపీ రామకృష్ణ, బాటరాజు, కర్నెబాలరాజ్, గుడిసెరాజు, కర్నె హుస్సేన్, పేట అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక శిక్షణ


కృత్రిమ మేధస్సుపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ లిటరసీ కృత్రిమమేధస్సు పై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం బుధవారం నారాయణపేట జిల్లాలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. కొత్త కార్యక్రమంలోని అన్ని రకాల ఆక్టివిటీస్ చేస్తూ వివరంగా తెలుసుకున్నారు. కార్యక్రమానికి జిల్లాఅకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌విద్యాసాగర్, మండల విద్యాధికారి బాలాజీసార్ ముఖ్య అతిథులుగా హాజరై, డిజిటల్ నైపుణ్యాలుకృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతపై విలువైన సూచనలు అందించారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా నరేష్, హరిసూదన్, విష్ణు వర్ధన్, రవి కుమార్, శంకర్ సింగ్ తదితరులు శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**ఉప్పునుంతల, ఆగస్టు13 ప్రభాతవార్త :** మండలంలోని వెలుటూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం ఘనంగా పోచమ్మ బోనాలు తీశారు. గ్రామంలో ఇంటింటికి బోనంతో మహిళలు గ్రామ శివారులో ఉన్న పోచమ్మ వద్దకు తీసుకెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలంకరణ చేసిన బోనాలతో మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు డప్పు చప్పులతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. పోచమ్మ వద్ద బోనాలతో పోచమ్మ చుట్టూ తిరిగి నైవేద్యాలు సమర్పించారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

**బిజినపల్లి, ఆగస్టు13 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026, 27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశము కొరకై ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్లో దరఖాస్తు గడువు ఆగస్టు 27 వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి. భాస్కర్ కుమార్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ, లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్నవిద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. నవోదయలో ఆరవ తరగతి ప్రవేశం కోరేటటువంటి అభ్యర్థులు ప్రస్తుతం ఐదో తరగతి (2025, 26)ఉమ్మడి జిల్లాలోనే చదువుతూ ఉండి, అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసము ఉమ్మడి జిల్లాలోనిదై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్ లైన్‌లో ఉచితంగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు నెల 27 వ తేదీ చివరి తేదీ అని, ఉమ్మడి జిల్లాలోని తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి. భాస్కర్ కుమార్ తెలిపారు.

## రైతు బీమా దరఖాస్తు పొడిగించాలి

**దామరగిద్ద, ఆగస్టు 13 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని రైతులందరికీ రైతు బీమా పథకము దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించాలి. భూమి పట్టాదారు రైతులు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి బ్రతుకుతున్నారు. కాబట్టి అందరి రైతులకు రైతు బీమా పథకం వర్తించేలా గడువు పొడిగించాలని మండల ప్రజలు కోరుతున్నారని బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు బోయిని గజలప్ప తెలిపారు.

## పంద్రాగస్టు వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రేపు నిర్వహించే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్, క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి హాజరైజాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు.

## పాఠశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

■ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్


ఎంఈఓల సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**మద్దూర్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** పాఠశాల నిర్మాణ సివిల్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ తెలిపారు. నారాయణపేట జిల్లా బుధవారం మద్దూరు మండల కేంద్రంలో బాలికల హైస్కూల్ లో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి డీఈఓ గోవిందరాజు ఎం. ఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూనాలుగు మండలాల పరిధిలో యుడైస్ డాటా వెంటనే అప్డేట్ చేయాలన్నారు. డ్రాప్ బాక్స్‌లోనీ స్టూడెంట్స్ ఇంపోర్టు వెంటనే చేయాలన్నారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కాడా క్రింద వెంటనే సివిల్ పనులు పూర్తి చేయాలన్నారు. అప్పర్ పర్సంటేజ్ పెంచి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లు పెంచాలని తెలిపారు.

## బోధనోపకరణాల మేళాను విజయవంతం చేద్దాం

**బిజినపల్లి, ఆగస్టు13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోధనోపకరణాల మేళాను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి రఘునందన్ శర్మ సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో ఒకటి నుండి అయిదు తరగతుల వరకు ఈనెల 20న నిర్వహించే బోధనోపకరణాల మేళాను విజయవంతం చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బోధనాభ్యసన సామగ్రి విద్యార్థుల్లో అర్థం చేసుకొని శక్తిని పెంచడంలో పాఠ్యాంశాలను సులభంగా అవగాహన చేసుకోవడంలోనూ కీలకపాత్ర ప్రోత్సహిస్తాయని అన్నారు. గదిలో సృజనాత్మక పద్ధతులు ప్రాజెక్టు వర్క్ ప్రాక్టికల్ డెమోలను ద్వారా విద్యా ర్థుల్లో ఆసక్తి చురుకుదనం పరిజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ఈ మేళాలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తయారుచేసిన టిఎల్ఎం మోడల్స్‌ను ప్రదర్శించిన వారికి పురస్కారాలు అందజేయున్నట్లు తెలిపారు.

## బైకులపై కేరింతలు కొడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు

◆ ఆకతాయిలకు సిఐ భగవంత్ రెడ్డి హెచ్చరిక


సిఐ భగవంత్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** కొంతమంది యువకులు, మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు, ముగ్గురు కూర్చొని, కేరింతలుకొడుతూ, అధికశబ్దం చేస్తూ, అతివేగంతో అజాగ్రత్తగా వాహనాలునడపడం వల్లరోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్‌ట్రాఫిక్ సిఐ భగవంతురెడ్డి హెచ్చరించారు. ఇటువంటి ప్రవర్తనతో వారు తమ ప్రాణాలకే కాకుండా ఇతరులప్రాణాలకు కూడా ముప్పుకలిగిస్తున్నారని ముఖ్యంగా మైనర్లు ఇలాంటి చర్యలకు పాల్పడడం ఆలోచించదగ్గ విషయమని తెలిపారు. మహబూబ్‌నగర్‌జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పట్టణంలో పాఠశాలల విద్యార్థులు, చిన్నారులు వివిధ వేషధారణలతో ర్యాలీలలో పాల్గొని ఆనందంగా వేడుకలను జరుపుకుంటారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ఎస్పీ మేడం ఆదేశాల మేరకు, ఇటువంటి నియమావళి ఉల్లంఘన చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారిని అదుపులోకి తీసుకునివారి వాహనాలను సీజ్ చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నాము. తల్లిదండ్రులు తమ పిల్లల వాహన వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. మన జిల్లా ప్రమాద రహిత జిల్లాగా నిలిచేలా అందరం కలసి కృషి చేయాలని కోరారు.

## భూ నిర్వాసితుల గోడు ప్రభుత్వానికి పట్టదా..?

◆ బిజెపి రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ


భూ నిర్వాసితుల పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు13 ప్రభాతవార్త:** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని బిజెపి రాష్ట్ర నాయకులు నాగురారావు నామాజీ మండి పడ్డారు. బుధవారం ఉట్కూరు మండల పరిధిలోని ఎడువెల్లి గ్రామంలో భూ నిర్వాసితుల పాదయాత్రను బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్‌తో కలిసి జెండా ఊపిప్రారంభించి మాట్లాడారు. నాగురారావు నామాజీ మాట్లాడుతూ గత నెల రోజులుగా అనేక రూపాలలో ఆందోళన చేస్తూ 29రోజులుగా జిల్లాకేంద్రంలో రీలే దీక్షలు చేస్తున్న నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. బహిరంగ మార్కెట్ ధరకనుగుణంగా పరిహారం చెల్లించాలని, ముఖ్యమంత్రి ఉన్న సొంత జిల్లా భూనిర్వాసితుల పట్ల వివక్షత కొనసాగుతున్నదని విమర్శించారు. భువనగిరి జిల్లా గంధ మల్లలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 24లక్షలు ఇవ్వగా రాష్ట్రమంత్రిగా శ్రీహరి సొంత నియోజక వర్గంమక్తల్ పరిధిలోని భూనిర్వాసితులకు ఎకరంకు కేవలం 14 లక్షలు ప్రకటించడం ఏమిటని ప్రశ్నిం చారు. కనీసం ముఖ్యమంత్రి నియోజకవర్గంలో లగచర్లలో ఇస్తున్న 20 లక్షలు కూడా ప్రకటించక పోవడం దారుణమని విమర్శించారు. నారాయణపేట కొడంగల్‌ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు ఎకరానికి రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నేడు మక్తల్ మండల తహసిల్దార్ కార్యాలయానికి కాచ్వార్ నుండి పాదయాత్ర ఉంటుందన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ,మంత్రిని కలిసినప్పటికి ప్రభుత్వం నుంచి సానుకూలమైన ప్రకటన నేటి వరకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విధంగా ప్రభుత్వం మొండితనంతో వ్యవహరిస్తే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎడవల్లి గ్రామం నుంచి చిన్నపొర్ల పెద్ద పోర్ల గ్రామాల మీదుగా కొల్లూరు గేట్ గుండా ఉట్కూర్ మండలకేంద్రానికి చేరుకొని ఊట్కూరు మండల కేంద్రానికి చేరుకొని పురవీధుల గుండా ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించితహసిల్దార్ కార్యాలయం ముట్టడించారు. తహ సీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మక్తల్ డివిజన్ కార్యదర్శి సలీం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్య దర్శి ఆంజనేయులు గౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ భూ నిర్వాసితులసంఘం జిల్లా అధ్యక్షులు మచ్చేందర్, ఉపాధ్య క్షులు ధర్మరాజు గౌడ నాయకులు గోపాల్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్ అనంతరం తహసిల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

- అత్యవసర సేవలో పాల్గొనే శాఖల అధికారులకు సెలవులు రద్దు
- రాబోయే 72 గంటలు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు 3 రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడు అందుబాటులోఉంటుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 08540-230201, 08540-230203 నెంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లాలోని 20 మండలాలు, 4మున్సిపాలిటీల్లో ప్రజలకు 24 గంటలు రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచా యతీ, నీటిపారుదల శాఖల అధికారులు 24 గంటలు అందు బాటులో ఉంటారని, జిల్లాలో అత్యవసర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు సెలవులురద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలుగుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని నీటిపారుదల, రెవెన్యూ, గ్రామపంచాయతీ, పోలీస్, మున్సిపల్ శాఖలను కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తూ శాఖల వారీగా నిర్వహించాల్సిన విధులు, విధానాలనువిడుదల చేశారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, కాలువలు, చెరువులు తదితర జలవనరులలో దిగుటకు, దాటుటకు ప్రయత్నించరాదని కలెక్టర్ ఆదేశించారు. భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునఅన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజా రక్షణ చర్యలలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరు వెళ్లకూడదని, పోలీసుశాఖ అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్ళకూడదని, రైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించా లని, చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని, అత్యవసర సమయాలలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం ఇతర వివరాల కొరకు జిల్లాలో గల సమీ కృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08540-230201, 08540-230203 నెంబర్లు ఏర్పాటు చేసి, 24గంటలు తక్షణసహాయం సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని, జిల్లాలో వరద, ఘటనల సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు అందించాలని తెలిపారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం చేయడం దేశద్రోహమే

◆ బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ



**వనపర్తి రూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేయడం దేశద్రోహమేనని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి శవయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల వైఖరిని ఖండిస్తూ బుధవారం బిజెపి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన రాహుల్‌గాంధీ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దగ్ధం, శవయాత్ర కార్యక్రమం చేపట్టగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం వనపర్తి పట్టణలోని రాజీవ్ చౌక్ లో బిజెపి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లాడుతూ సోమవారం జరిగిన ఈ ఘటనపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ సాక్షాత్తు ప్రధానమంత్రి దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలో రోడ్లపై శవయాత్ర నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేసిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే ఓట్ల చోరీ, ఈవీఎం లు, వనపర్తి అభివృద్ధి ఏదైనా సరే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, కోశాధికారి భాసెట్టి శీను, మోర్చాల రాష్ట్ర నాయకులు కదిరే మధు, అలివేలమ్మ, మహిళామోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ, అధికార ప్రతినిధులు పెద్దిరాజు, గజరాజుల తిరుమలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపీనాథ్ యాదవ్, కాటమొని కృష్ణగౌడ్, పట్టణ ప్రధానకార్యదర్శిదంతోజునవీన్, నల్లవతుల అరవింద్, ఉపాధ్యక్షులు ఉపేందర్‌యాదవ్, కోశాధికారి కూన శ్రీకాంత్, కార్యదర్శులు కడమంచి శివ, అశ్విని పవన్ తదితరులు పాల్గొన్నారు.